క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో శనివారం సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు శేర్నపల్లి వాగును పరిశీలించారు. నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఎవరు అటువైపు వెళ్లొద్దని పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీఐ తెలిపారు.

నర్వ: ప్రజలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మల్లారెడ్డి, ఎస్ఐ కురుమయ్య తెలిపారు.

మాగనూర్: మండలంలో కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని నేరడగం, మాగనూర్, అడవిసత్యావార్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు ఎవరు వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్ సాయి కుమార్ తదితరులు ఉన్నారు.

ఆలయ సేవకులకు సన్మానం

మరికల్: మండల కేంద్రంలోని రాయచూర్ సమీపంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో సేవకులను భక్తులు శనివారం సన్మానించారు. నిత్య పూజలకు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి, జగన్, పుల్లయ్యగౌడ్, రాజు, రాంచంద్రయ్యగౌడ్, పురుషోత్తంరెడ్డి, కృష్ణచారిలతో పాటు పూజారి వెంకటేశ్వర్లుశర్మ సేవలను గుర్తించిన బీఆర్ఎస్ నాయకుడు కర్లి కృష్ణయ్య వారిని సన్మానించి పాదాభివందనం చేసుకున్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ఊట్కూరు: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజనల్ చైర్మన్ గోపాలకృష్ణ, జోనల్ చైర్మన్ శ్రీహరి, జనార్దన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, వసంతకుమార్, రమేష్‌బాబు, పీఈటీ పారిజాత పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు



మక్తల్/ కృష్ణా: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ నారాయణ పదవి విరమణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నారాయణ గ్రామస్థాయి నుంచి విధులు నిర్వహిస్తూ, జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగిగా విరమణ పొందడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఎంపీఓ విజయలక్ష్మీ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మక్తల్ మండలంలోని శనివారం జూనియర్ అసిస్టెంట్ గుంటగారి మహదేవ్ పదవి విరమణ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్, మల్లికార్జున్, రాజశేఖర్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, రవికుమార్, చీరాల సత్యనారాయణ, కొండయ్య, రవీందర్ పాల్గొన్నారు.

మరికల్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని పంచాయతీరాజ్ ఈఈ నీల్యానాయక్ అన్నారు. పేట పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ నరేందర్ పదవీ విరమణ సందర్భంగా మండలంలోని శనివారం ఏర్పాటుచేసిన సన్మానసభలో మాట్లాడారు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ఈఈ విజయ్‌భాస్కర్, ఏఈలు వెంకటేష్, ప్రవీణ్, రాజారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌శెట్టి, రాజేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ

మాగనూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దండు ఆనంద్, నరేష్, భాస్కర్‌పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి డీసీఎం పట్టివేత

మక్తల్: విద్యుత్ సామగ్రిని తరలిస్తున్న డీసీఎంను శనివారం మండలంలోని చందాపూర్ గ్రామస్తులు పట్టుకున్నారు. విద్యుత్ సామగ్రిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారని డీసీఎం డ్రైవర్‌ను గ్రామస్తులు నిలదీయగా.. పొంతలేని సమాధానం ఇవ్వడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి, వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కోస్గి: నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేడు ఆదివారం కోస్గిలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐక్య వేదిక ప్రతినిధి రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు వివరాల సేకరణ

కోస్గి: రుణమాఫీ పథకంలో లబ్ధిపొందని వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు మరో మారు నమోదు చేస్తున్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం గుండుమాల్ మండల కేంద్రంలోని వివరాలు సేకరించి ఏఈఓ తిరుపతి, నరేందర్, హర్షవర్ధన్‌గౌడ్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.



ధన్వాడలో ఉధృతంగా పారుతున్న పాతపల్లి వాగు



మల్లేపల్లి వద్ద వరదనీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనుంజయగౌడ్



ఉడ్మల్‌గిద్ద చెరువు కింద పారుతున్న వాగు

నిండిన చెరువులు.. పొంగిన వాగులు

నారాయణపేట రూరల్: గతరెండు రోజులుగా జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో భారీవర్షానికి చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. మరోవైపు వాగులు పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీంతో చాలాచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కోటకొండ చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతుంది. అదేవిధంగా సింగారం వాగుకు వరద పోటెత్తింది. దీంతో కల్వర్టులపైనుంచి వరదనీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఇక జాజాపూర్ గ్రామశివారులో లోలెవల్ వంతెనపై నుంచి ప్రమాదకరంగా నీరు వెళ్తుండటంతో శేర్నపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక అభంగాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బండగొండ, భూనేడ్ వైపువాహన రాకపోకలను నిలిపివేశారు.

మక్తల్/ఊట్కూరు/ధన్వాడ/దామరగిద్ద: ఊట్కూర్‌లోని పెద్దజట్రం, నిడుగుర్తి, తిప్రాసిపల్లి తదితర గ్రామాల చెరువుల్లో భారీ వరదనీరు చేరింది. మల్లేపల్లి ముక్కన్న చెరువు అలుగు పారడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీఓ ధనుంజయగౌడ్ మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి వరదనీటి ప్రభావాన్ని పరిశీలించారు.అలాగే మక్తల్ పట్టణంలోని భారీవర్షానికి ఎల్లమ్మ కుంటచెరువులో నీరుచేరి జలమయంగా మారింది. శనివారం మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్ పలు కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులను తొలగించారు. అదేవిధంగా మండంలోని మాద్వార్, గుడిగండ్ల, కర్ని, కాచ్‌వార్ గ్రామాల చెరువుల్లో భారీ వరదనీరు చేరింది. అలాగే ధన్వాడలోని యంనోనిపల్లి నుంచి కంసాన్‌పల్లి వెళ్లే మన్నెవాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పాతపల్లికి వెళ్లే వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక పోయారు. అలాగే మరికల్‌లో ఉన్న వాగులు, వంకలు పొంగిపొర్లడంతో 31 చెరువులు, 12 కుంటలు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. మరికల్‌లో చెరువులు కబ్జాకు గురికావడంతో జాతీయ రహదారిపై భారీగా వరదనీళ్లు రావడంతో ఇళ్లు, గుడిసేల్లోకి చేరడంతో వారు తమ పసిపిల్లలతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటు రాత్రాంత కాలం వెల్లదిశారు. అలాగే మన్నెవాగు పొంగిపార్లడంతో కన్మనూర్ మరికల్ మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపైకి పెద్ద చెరువు ఇరువుల అలుగు పారడంతో అధికారులు పరిశీలించారు. దామరగిద్దలో ఉడ్మల్‌గిద్ద, సజనాపూర్ చెరువులు అలుగుపారుతున్నాయి. అలాగే కాన్‌కుర్తి, దామరగిద్ద, లోకూర్తి, ఆశన్‌పల్లి, క్యాతన్‌పల్లి, వత్తుగుండ్ల, కంసాన్‌పల్లి తదితర అన్ని గ్రామాల్లో పంటలు వరద నీటిలో మునిగాయి. ఉడ్మల్‌గిద్దలో చెరువులోని చేపలు వరద నీటికి ఎదురెక్కడంతో పంట కాల్వల్లోకి వచ్చిన చేపలను రైతులు పట్టుకున్నారు



ఉధృతంగా ప్రవహిస్తున్న సింగారంవాగు



మరికల్ జాతీయ రహదారిపైకి వచ్చిన వరదనీరు



మన్నెవాగు పొంగిపొర్లడంతో వాగుదాటుతున్న గ్రామస్తులు



భారీ వర్షంతో పారుతున్న మాద్వార్ చెరువు



నిండుకుండలా ధన్వాడ పెద్ద చెరువు

బాధిత రైతులను ఆదుకోవాలి..



మాట్లాడుతున్న కొండన్న

నారాయణపేట: కురిసిన భారీ వర్షాలకు రైతుల పంట పొలాలు తీవ్రంగా నష్టపోయాయని, ప్రభుత్వ నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న, రైతు సంఘం జిల్లా నాయకులు పి రాములు కోరారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీని అందించాలని, బ్యాంకర్లు కొర్రిలతో రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను నివారించాలన్నారు. అలాగే భారతీయ కిసాన్‌సాంగ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ అజయ్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా మాట్లాడారు.. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయా కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవదాస్, రాము, బీకేఎస్ జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రాము, నర్సింహులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సురేష్

నారాయణపేట రూరల్ : జిల్లా న్యాయసేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని బైరంకొండలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందని, ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. న్యాయ సలహాలకోసం 15100 నంబర్ కు ఫోన్‌చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి బి. రాజేష్, పంచాయతీ సెక్రటరీ నాగిరెడ్డి, ఏఎస్ఐ ఆంజనేయులు, సైబన్న, పార లీగల్ వలంటీర్ రూపిక, శారదా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నారాయణపేట రూరల్: ప్రజ్ఞా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో శ్రీసాయిస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు విజేతలైన లావణ్య, మీనాక్షి, సోను రాథోడ్‌ను శనివారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. కరస్పాండెంట్ సాయిలీల, టీచర్లు అమీనా, నర్సింహ, ఉమా పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం త్వరగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.. ఎస్సీ, ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాధితులకు నష్టపరిహారం అందించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని సి సెక్షన్ సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. ఆరు నెలలుగా బడ్జెట్ రాలేదని సి సెక్షన్ అధికారి కలెక్టర్‌కు వివరించారు. బడ్జెట్ వచ్చిన వెంటనే రెండు వారాలకోసారి నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాగా అంతకుముందు సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల వారీగా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులను వివరించారు. 2023, 2024 సంవత్సరాలలో నమోదైన 25కేసుల వివరాలను వెల్లడించారు. అయితే కేసులు ఎక్కువగా భూ వివాదాల కారణాలతోనే నమోదు అవుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను డీఎస్పీ నల్లపు లింగయ్య విచారిస్తున్నారని తెలిపారు. నమోదైన కేసులలో చాలా కేసులు మక్తల్ పరిధిలోనే ఉన్నాయన్నారు. తమ పోలీసు శాఖపరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గత 3నెలల నుంచి 8 గ్రామాల్లో అవగాహన ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులను వేగిరం చేయాలి

జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం వద్ద నూతనంగా నిర్మిస్తున్న జిల్లా సమీకృత భవన సముదాయ (కలెక్టరేట్) నిర్మాణ పనులను వేగిరం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని ఆర్ అండ్‌బీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, ఆర్టీఓ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివా వీసీలో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు సేఫ్టీ సమావేశాన్ని ఎస్పీ యోగేష్‌గౌతమ్‌తో కలిసి నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు అధికం అవుతున్నాయని, వాటిని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో 2021 నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలపై వివరించారు. ఆయా ప్రమాదాలలో 2023లో 102 మంది చనిపోయారని, 2024లో 67మంది చనిపోయారని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీఓ మధుమోహన్, డీఎస్పీ నల్లపు లింగయ్య, మహేష్, జిల్లా అధికారులు ఉమాపతి, ఖలీల్, జాన్‌సుధాకర్, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఆర్టీఓ మేఘాగాంధీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నర్సింగం, ఈఈ దేశ్యానాయక్, డీఈ రాములు, జయబాయి, కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సునీత, సీఐలు శివశంకర్, చంద్రశేఖర్, దస్రు నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు



కోస్గిలో ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు



బైరంకొండలో...

కోస్గి: పట్టణ శివారులోని పాతర్లగడ్డ ఆంజనేయ స్వామి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. ఈ జాతర ఉత్సవాలకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే పట్టణంలోని శ్రీరామ కాలనీలో అభయాంజనేయ స్వామిఆలయంలో శ్రావణ మాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కౌన్సిలర్ మంజుల శ్రీనివాస్ దంపతులతోపాటు పలువురు కాలనీవాసులు పూజల్లో పాల్గొన్నారు. అలాగే ముక్తిపాడ్ పరిధిలోని శ్రీ పార్వతీశ్వరస్వామి ఆలయ ఆవరణలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కనుల పండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్చరణలు, హోమం, ప్రత్యేక పూజల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వేద పండితులు వీరేశ లింగం, పరమేశ్వర శాస్త్రీ, వేణుమాదవ్ శర్మ, సోమేశ్వర్ నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు జల్ది ఊరేగింపు నిర్వహించారు. జూనియర్ కళాశాల వద్ద ఉన్న బోరు వద్ద ప్రత్యేక పూజలు చేసి గంగాజలానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముష్టి నర్సింహులు, బజారి విజయ్, రమేష్, రాకేష్, విజయ్, కృష్ణ, తిరుమలప్ప, అంజయ్య పాల్గొన్నారు.

పల్లకి సేవ

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా పల్లకీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు రామారావు, భక్తులు మల్లేష్, హన్మంతు, వెంకటప్ప పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సామాన్‌పల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా కృష్ణానది నుంచి భక్తులు పుష్కర నీటిని తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. అంతకుముందు భక్తులు నృత్యాలు, భజనలు చేసుకుంటు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో శ్రీ ఆంజనేయస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు వైభవంగా నిర్వాహించారు. భక్తులు స్వామివారిని పల్లకిలో కృష్ణా నదికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో దాతలు 8 కేజీల వెండి నూతన స్వామివారి విగ్రహాన్ని వితరణ చేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలుచేసి, హోమం కార్యక్రమం నిర్వహించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆంజనేయ స్వామి సప్తాంగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకడ్మూర్, రాంపూర్‌గేట్ అభంజనేయస్వామి విగ్రహాలకు అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఇతర అభివృద్ధి పనుల కోసం రూ. 25 వేలు వితరణ చేసిన ప్రవీణ్‌కుమార్‌శెట్టి, కుర్వ నర్సింహులు దంపతులను అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

మరికల్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఉత్సవాలను శనివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు గ్రామ శివారులోని బావి నుంచి బ్రాహ్మణులు వెంకటేశ్వర్లశర్మ, వేణుగోపాల్ శర్మ స్వామివారికి జల్ది బిందెలను ఊరేగింపుగా తీసుకొచ్చి జలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అలాగే కోట్ల ఆంజనేయస్వామివారికి పూజలు చేశారు. అనంతరం భక్తులుపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



సామాన్‌పల్లిలో



మాగనూర్‌లో..

ఘనంగా కనకాద్రి ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ పంచాయతీ నెమళ్లపల్లిలో శ్రీ కనకాద్రి లక్ష్మీనర్సింహా స్వామి జాతర వైభవంగా కొనసాగింది. శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం పల్లకిసేవ, జల్దిబిందె, అభిషేకం తదితర పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డితో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని బైరంకొండలో బైరప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్వామివారికి గ్రామనుంచి జల్దిబిందెను తీసుకెళ్లి ఆలయంలో పూజలు చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మూఢనమ్మకాలను వీడాలి



మాగనూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని అధికారులు అన్నారు. ప్రతి నెల చివరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పీఎస్ పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి శనివారం కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఈ మేరకు..సంబంధిత పీఎస్‌ల ఎస్ఐ, ఏఎస్ఐలు పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మరికల్: సమాజంలో మూఢనమ్మకాలను వీడాలని తహసీల్దార్ జమీల్, ఆర్ఐ శ్రీశైలం అన్నారు. మండలంలోని శనివారం సివిల్ రైట్ డై నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇక కొనసాగుతున్న రెండు గ్లాసుల పద్ధతి, కులాల పేరుతో దూషించడం, ఆలయంలోకి ప్రవేశం లేక పోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సివిల్ రైటర్స్ డే నిర్వహించారు. ఈ మేరకు.. ప్రతి నెల చివరిరోజున గ్రామాల్లో ప్రజలకు, యువకులు, విద్యార్థులకు తమ యొక్క హక్కుల గురించి వివరించారు. రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్ సాయికుమార్ పాల్గొన్నారు.